RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# ఒక చేతిలో బిడ్డ.. ఇంకో చేతిలో విప్లవం: దుర్గా భాభి సాహస గాథ!

అక్టోబర్ 7 దుర్గాదేవి జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం




అది 1928 డిసెంబర్ నెల, లాహోర్ రైల్వే స్టేషన్. ఎక్కడ చూసినా ఆయుధాలు పట్టుకున్న బ్రిటిష్ పోలీసులు. ప్రతి దారినీ నిశితంగా గమనిస్తున్నారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే పట్టుకోవాలని చూస్తున్నారు. మన దేశమంతా ఎంతగానో అభిమానించే గొప్ప నాయకుడు లాలా లజపతిరాయ్ బ్రిటిష్ వారి లాఠీ దెబ్బల కారణంగా మరణించగా, దానికి ప్రతీకారంగా బ్రిటిష్ పోలీస్ ఆఫీసర్ సాండర్స్‌ను కాల్చి చంపిన యువ విప్లవకారుడు భగత్ సింగ్ కోసం పోలీసులు తీవ్రంగా వెతుకుతున్నారు. లాహోర్ నగరమంతా పోలీసుల మోహరింపులతో నిండిపోయింది.

అంతటి కట్టుదిట్టమైన పోలీస్ కాపలాను దాటుకుంటూ, ఒక హోదా ఉన్న కుటుంబంలా కనిపిస్తున్న జంట చంటిబిడ్డను ఎత్తుకుని ధైర్యంగా ముందుకు నడిచింది. కోటు, హ్యాట్ వేసుకున్న భర్త గంభీరంగా ఉంటే, భార్య పసిపాపను ఎంతో ప్రశాంతంగా ఎత్తుకుని నడుస్తోంది. వారి వెనకాల సామాన్లు మోస్తూ ఒక పనిమనిషి వస్తున్నాడు. అక్కడ ఉన్న ఒక్క పోలీస్ కూడా వారిని అనుమానించలేదు, ఆపలేదు.

అక్కడ సూటు వేసుకుని ఉన్న ఆ "భర్త" ఎవరో కాదు... విప్లవ వీరుడు భగత్ సింగ్! సామాన్లు మోస్తున్న ఆ "పనిమనిషి" రాజ్‌గురు! ఇక భగత్ సింగ్‌కు భార్యగా నటించి, శత్రువుల కళ్లల్లో దుమ్ము కొట్టి రక్షించిన ఆ వీరనారి... దుర్గాదేవి! ఉద్యమంలో అందరూ ఆమెను "దుర్గా భాభి" అని పిలుచుకునేవారు.

అక్టోబర్ 7, 1907న అలహాబాద్ దగ్గర్లోని షెహజాద్‌పూర్‌లో పుట్టిన దుర్గాదేవికి, 11 ఏళ్ల చిన్న వయస్సులోనే భగవతి చరణ్ వోహ్రాతో పెళ్లయింది. ఆయన స్వాతంత్ర్య పోరాటంలో అద్వితీయ పాత్ర పోషించిన 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' (హెచ్‌ఎస్‌ఆర్‌ఏ)లో కీలక విప్లవకారుడు. భర్త ప్రభావంతో ఆమె కూడా విప్లవ పోరాటంలోకి వచ్చారు. విప్లవకారులంతా ఆమెను ఆప్యాయంగా "భాభి" (వదిన) అని పిలిచేవారు. కాలక్రమేణా ఆ పేరే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

దుర్గా భాభి కేవలం విప్లవకారులకు ఆశ్రయం ఇవ్వడానికో, పోలీసు నిఘా నుండి కాపాడటానికో పరిమితం కాలేదు. ఆమె స్వయంగా పోరాటంలో పాల్గొన్నారు. ఢిల్లీలో సబ్బుల కంపెనీ ముసుగులో నడిపిన బాంబుల తయారీ కేంద్రం నిర్వహణలో సహాయం చేశారు. అంతేకాదు, భగత్ సింగ్, ఆయన సహచరుల కేసుల ఖర్చుల కోసం, ఉద్యమ అవసరాల కోసం ఆ కాలంలోనే తన రూ. 3,000 విలువైన బంగారు నగలను కూడా అమ్మేశారు. ఆమెకు దేశభక్తి అంటే మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపించడం!

1929 సెప్టెంబరులో లాహోర్ జైలులో 63 రోజుల నిరాహార దీక్ష తర్వాత జతీంద్రనాథ్ దాస్ చనిపోయినప్పుడు, ఆయన అంతిమ యాత్రలో దుర్గా భాభి ముందుండి నడిచారు. ఆ యాత్ర బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పెద్ద నిరసనగా మారింది, బ్రిటిష్ వాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది.

1930 మే 28 దుర్గా భాభి జీవితంలో అత్యంత విషాదకరమైన రోజు. రవి నది ఒడ్డున బాంబు పరీక్ష చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆమె భర్త భగవతి చరణ్ వోహ్రా చనిపోయారు. చిన్న బిడ్డతో ఒంటరిదైనప్పటికీ, ఆ పెద్ద విషాదం కూడా ఆమెను పోరాట మార్గం నుంచి పక్కకు తప్పించలేకపోయింది. బ్రిటిష్ అణచివేత ఎక్కువైన సమయంలో, 1930 అక్టోబరులో బొంబాయిలోని లామింగ్టన్ రోడ్‌లో బ్రిటిష్ అధికారి సర్జెంట్ టేలర్‌పై జరిగిన కాల్పుల దాడిలో దుర్గా భాభి స్వయంగా పాల్గొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ అమరుడవ్వడం, స్వాతంత్ర్య విప్లవోద్యమం బలహీనపడటంతో ఆమె జైలుశిక్ష అనుభవించారు, పోలీసుల నిఘాను ఎదుర్కొన్నారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆమె ఎంచుకున్న మార్గం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. స్వాతంత్ర్యం వచ్చాక చాలామంది పదవులు, గుర్తింపు కోసం చూస్తే... దుర్గా భాభి మాత్రం ఏ ఆర్భాటం లేకుండా నిశ్శబ్దంగా సేవ చేయడాన్ని ఎంచుకున్నారు. లక్నోలో పేద పిల్లల కోసం ఒక బడిని పెట్టి, వారికి చదువు చెప్పించడానికే తన జీవితాన్ని అంకితం చేశారు. ఒకనాడు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఆమె, స్వాతంత్ర్యం వచ్చాక ఆ దేశ భావి పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్నారు.

ఆమె అక్టోబర్ 15, 1999న తన 92వ ఏట ఘాజియాబాద్‌లో కన్నుమూశారు.

స్వాతంత్ర్య పోరాటంలో తుపాకీ పట్టిన విప్లవకారిణిగా, శాంతియుత నిరసనల్లో పాల్గొన్న ఉద్యమకారిణిగా, స్వాతంత్ర్యం వచ్చాక 40 ఏళ్లు చదువు చెప్పే టీచర్‌గా సమాజానికి సేవ చేసిన దుర్గా భాభి జీవితం చాలా గొప్పది. ఏమి ఆశించకుండా దేశం కోసం పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఆమె నిరూపించారు. అక్టోబర్ 7న దుర్గా భాభి జయంతి సందర్భంగా ఆ వీరనారి త్యాగానికి, ధైర్యానికి హృదయపూర్వక నివాళులు అర్పిద్దాం!

వ్యాసకర్త
గుండా శ్రీనివాస్
పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌లో సీనియర్ అధికారి, ×జూ× ఫెలో మెంబర్

# సింగరేణి కార్మికులకు 36% లాభాల వాటా చెల్లించాలి

వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి

జీఎంకు టీబీజీకేఎస్ వినతిపత్రం



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**

సింగరేణి కార్మికులకు కంపెనీ లాభాల్లో 36 శాతం వాటాను చెల్లించాలని టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు గడప రాజయ్య నేతృత్వంలో నాయకులు ఏరియా జీఎం సీహెచ్ వెంకటరమణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాపు కృష్ణ మాట్లాడుతూ సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ఎలాంటి మినహాయింపులు లేకుండా ప్రకటించాలని కోరారు. లాభాల వాటా 36 శాతాన్ని వెంటనే ప్రకటించి, కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ లీగల్ అడ్వైజర్ జీకే సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు బోరింగ్ శంకర్, కాగితపు విజయ్‌కుమార్, ఎంటెక్ మహేందర్, విద్యాసాగర్, రాజ్‌కుమార్, కుమార్, పూర్ణ, రాములు, అరె దివ్య, నరేష్, హమీద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగట్టు వద్ద ర్యాంపు నిర్మాణానికి చర్యలు



- గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సులభతరం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ప్రతినిధి):** శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద జాతీయ రహదారి––563 విస్తరణతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యకు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు సురక్షితంగా రహదారి దాటేలా క్రాసింగ్ వద్ద ర్యాంపు నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి గొల్లపల్లి, కొత్తగట్టు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. గ్రామానికి ఒకవైపు నివాస ప్రాంతాలు, మరోవైపు గ్రామ పంచాయతీ కార్యాలయం, స్మశానవాటిక, వ్యవసాయ భూములు ఉండటంతో రహదారి దాటేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు కూడా దూరంలోని యూటర్న్ వరకు వెళ్లి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తగట్టు వద్ద అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గత ఆదివారం నుంచి కొత్తగట్టు టోల్‌ప్లాజా వద్ద టెంట్ ఏర్పాటు చేసి నిరవధిక సమ్మె చేపట్టారు. మంగళవారం నాటికి ఆందోళన మూడో రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం రాత్రి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్తగట్టు వద్ద నెలకొన్న పరిస్థితులు, గ్రామస్తుల ఇబ్బందులు, ర్యాంపు నిర్మాణం అవసరంపై చర్చించారు. ఇప్పటికే ఒకవైపు నిర్మించిన ర్యాంపుతో పాటు మరోవైపు కూడా ర్యాంపు ఏర్పాటు చేసి, అండర్‌పాస్ ద్వారా ప్రజలు సులభంగా, సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు.

సమీక్షలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, జాతీయ రహదారి––563 ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

- వీకే సీఎం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి: ఏఐటీయూసీ



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):** కొత్తగూడెం ఏరియాలోని వీకే సీఎం ఉపరితల గనికి నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. శంకర్‌ను ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ నాయకులు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీకే సీఎం ఓసీపీ కొత్తగూడెం ఏరియాలో కీలకమైన, లాభదాయకమైన ప్రాజెక్టుల్లో ఒకటని తెలిపారు. గత కొన్ని నెలలుగా సాంకేతిక, కార్మిక సమస్యల కారణంగా పనులు కొంత మందగించాయని పేర్కొన్నారు. నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్ జి. శంకర్ అనుభవంతో ప్రాజెక్టు పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యాన్‌పవర్ కొరత, యంత్రాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, కార్మికుల సంక్షేమ సౌకర్యాలపై నూతన పీఓ ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య కోరారు. యాజమాన్యం, కార్మికుల మధ్య వారధిగా ఏఐటీయూసీ ఎల్లప్పుడూ పనిచేస్తుందని తెలిపారు. నూతన పీఓ జి. శంకర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కార్మికుల సహకారంతో వీకే సీఎం ప్రాజెక్టును అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఆఫీస్ బేరర్ హీరాలాల్, వీకే సీఎం అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కోటి, ఏరియా స్టోర్స్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్ (కమల్), సీనియర్ నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, ఓదెలు, శ్రీనివాస్, పాల్తేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సు, కాగడా గుర్తులకు ఓటేయండి

- కార్మిక సంక్షేమానికి ఈయూ, ఎన్ఎంయూ భరోసా
- ఎర్రజెండా అండతోనే సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే కూనంనేని




**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):** టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బస్సు, కాగడా గుర్తులపై ఓటు వేసి ఈయూ, ఎన్ఎంయూ కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, కార్మికుల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని కూనంనేని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమన్నారు.

ఈ నెల 9న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్‌లు కలిసి పోటీ చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి క్లాజ్––3 కింద పోటీ చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్‌కు 'బస్సు' గుర్తుపై, ఖమ్మం రీజియన్ స్థాయిలో క్లాజ్–6 కింద పోటీ చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు 'కాగడా' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాడే సంఘాలకు అండగా నిలిచి, తమ ఓటుతో కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, నేరెళ్ల రమేష్, ఈయూ, ఎన్ఎంయూ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్. బాబు, మౌలానా, థామస్ రెడ్డి, పిల్లి రమేష్, టీవీ ప్రసాద్, ఎస్‌డీ నజీర్, ఆర్ఎన్ సింగ్, హరివర్మ, జీసీ శేఖర్, ఖాజామొహినుద్దీన్, జి. రాజు, రేణుకాదేవి, రాధాదేవి, సంధ్య పాల్గొన్నారు.

# రాందాస్ కుటుంబాన్ని పరామర్శించిన కోనేరు చిన్ని



**పాల్వంచ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):** పాల్వంచ మండలం కరకవాగు గ్రామానికి చెందిన కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు, టీడీపీ వీరాభిమాని భట్టు రాందాస్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని మంగళవారం కరకవాగులోని రాందాస్ స్వగృహానికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావి రాంబాబు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్.జె.కె. అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల వెంకటరావు, మాలంపాటి కిరణ్‌కుమార్ చౌదరి, జిల్లా టీడీపీ నాయకులు కాపా కృష్ణమోహన్, కనగాల అనంతరాములు, వడ్లమూడి వేణు, గడ్డం ఆదిబాబు, జొన్నాడ రమేష్, వివిధ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం సైబర్ క్రైమ్ సీఐగా నరేష్



**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**

కొత్తగూడెం సైబర్ క్రైమ్ సీఐగా పనిచేస్తున్న జితేందర్‌ను వన్‌టౌన్ సీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ సైబర్ క్రైమ్ సీఐగా ఉన్న నరేష్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఇరువురు అధికారులు కొత్త బాధ్యతలు స్వీకరించనున్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల బోనస్ ఇవ్వాలి

సింగరేణి జీఎంకు ఐఎఫ్‌టీయూ అనుబంధ యూనియన్ వినతి



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**

సింగరేణి వార్షిక లాభాల వాటాలో కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్‌ను 10 శాతానికి పెంచి చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కొత్తగూడెం ఏరియా జీఎంకు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కే. వాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌సీసీడబ్ల్యూయూ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్. సంజీవ్ మాట్లాడుతూ సింగరేణి పరిధిలో సుమారు 40 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి లాభాల్లో వారి శ్రమ కూడా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పర్మినెంట్ కార్మికులకు లాభాల బోనస్ అందించడం సంతోషకరమేనని, అదే విధంగా వారితో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బోనస్ పెంచి చెల్లించాలని కోరారు. ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ వర్తించడం లేదని తెలిపారు. ఈ ఏడాది నుంచి కోల్ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల బోనస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లాభాల బోనస్‌పై అక్టోబర్ 7న సాయంత్రం హెడ్ ఆఫీస్ ఎదుట నిర్వహించే ధర్నాలో అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకుల వినతిపై జీఎం స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి కే. వాసు, ఓబీ, కోల్ ట్రాన్స్‌పోర్ట్ నాయకులు తాతారావు, వెంకన్న, శరత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ పరిరక్షణ కోసం ఐక్య కూటమిని గెలిపించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

కొత్తగూడెం డిపోలో ఆర్టీసీ ఎన్నికల ప్రచారం



**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్, టీఎంయూ, టిడబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ ఐక్య కూటమిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం కొత్తగూడెం ఆర్టీసీ బస్ డిపోలో సీపీఎం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న సంఘాలకు కార్మికులు అండగా నిలవాలని కోరారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో 55 రోజులపాటు నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల సమ్మెను ఆయన గుర్తుచేశారు. కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా, ప్రైవేటు సంస్థలకు పనులు అప్పగించే విధానాలను అడ్డుకోవాలంటే ఐక్య కూటమిని బలపరచాలని కోరారు. ఒక్క కార్మికుడికి సమస్య వచ్చినా అండగా నిలిచి, పని భారం పెరిగితే తగ్గించే వరకు పోరాటం చేసే సంఘాలను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో 'బాణం' గుర్తుకు, రీజియన్ స్థాయిలో 'నక్షత్రం' గుర్తుకు ఓటు వేసి ఐక్య కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, కొత్తగూడెం డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, కార్యదర్శి ఇస్నాపల్లి శామ్యూల్, టిడబ్ల్యూయూ అధ్యక్షుడు అనిల్, ప్రమోద్, రామకృష్ణ, షరీఫ్, శ్రీనివాసు, బాలకృష్ణ, రఘు, నసూర్, రాంబాబు తదితర కార్మికులు పాల్గొన్నారు.

RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
బుధవారం , అక్టోబర్ 7 , 2026

## పల్లెపల్లెకు ఆర్టీసీ సేవలు విస్తరిస్తాం

**మారుమూల గ్రామాల రోడ్ల సమస్యలు పరిష్కరించాం: ఎమ్మెల్యే కూనంనేని**

**పాల్వంచ--దంతలబోరు ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం**




**పాల్వంచ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
ప్రతి పల్లెకు ప్రజారవాణా ఆర్టీసీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం పాల్వంచ మండలం నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాల్వంచ--దంతలబోరు ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సంబంధించిన ప్రధాన రహదారుల సమస్యలను పరిష్కరించామని, త్వరలోనే అంతర్గత రహదారుల పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజారవాణా వ్యవస్థలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజలు ఆర్టీసీ సేవలను ఆదరించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణానికి ప్రజలు సహకరించాలని సూచించారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు యాదవ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, సంఘం సర్పంచ్ బానోతు రవి, నారాయణరావుపేట సర్పంచ్ బండి సరస్వతి, దంతలబోరు సర్పంచ్, నాయకులు బానోతు రంజిత్, ప్రేమచంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, సీహెచ్. శ్రీను, సాయిలి ఎంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేక రాంబాబు, గ్రామ పెద్దలు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి లాభాల్లో కార్మికుల వాటా ప్రకటించాలి

**ఈ నెల 10లోపు ప్రకటించకపోతే 12న నిరాహార దీక్ష**

**సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ**

**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**



సింగరేణి కాలరీస్‌లో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను చెల్లించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యాజమాన్యానికి గడువు విధిస్తూ, లాభాల వాటా ప్రకటించకపోతే నిరాహార దీక్ష చేపడతామని యూనియన్ నాయకులు ప్రకటించారు. సింగరేణిలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు లాభాలను ప్రకటించకపోవడంతో పాటు కార్మికులకు రావాల్సిన వాటాపైనా స్పష్టత ఇవ్వలేదని యూనియన్ ఉపాధ్యక్షుడు కోటగిరి పాపయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెపు రాజు తెలిపారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఈ అంశంపై తగిన స్థాయిలో స్పందించడం లేదని విమర్శించారు. గతంలో కార్మికుల పోరాటాల ఫలితంగా లాభాల్లో వాటా చెల్లింపు ప్రారంభమైందని, తొలుత 10 శాతంగా ఉన్న వాటా ప్రస్తుతం సుమారు 34 శాతానికి చేరిందని పేర్కొన్నారు. ఈ వాటాను కొనసాగిస్తూ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల్లో కార్మికుల వాటాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 10లోపు లాభాల వాటా ప్రకటించాలి.అక్టోబర్ 10లోపు కార్మికుల లాభాల వాటాను ప్రకటించాలని యూనియన్ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో అక్టోబర్ 12న ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించింది. కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే జారె

**విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులు**

**అశ్వారావుపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**





అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం, జగ్గారం, నాగుపల్లి గ్రామపంచాయతీల పరిధిలో మంగళవారం పర్యటించారు. పట్వారిగూడెంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన కొండా వెంకటలక్ష్మి, నాగుపల్లిలో మృతి చెందిన మారగాని విజయ కుటుంబాలకు విద్యుత్ శాఖ మంజూరు చేసిన ఒక్కొక్కటి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న గోళ్ల నారాయణను, కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వగ్గెల ముత్యా లరావును, చేయి విరిగిన వార్డు సభ్యురాలు సోయంబాల నాగమణిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాగుపల్లిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను మారగాని నాగేశ్వరరావు, మట్టా రమణ, ఊకే రాజేష్, బొబ్బిలి శ్రీనివాసరావులకు వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, డీఈ బద్రుపవార్, ఏడీఈ వెంకటరత్నం, ఏఈ రమేష్, ఎల్ఐలు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, ఎస్ఎల్ఐ రత్నాజీ, బూర్గుల ప్రసాద్, సర్పంచులు కూరం అర్జున్‌రావు, వంకా జానకిరాముడు, ఇస్లావత్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు వాసం శ్రీనివాసరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, కుంపటి వేణు, ఎస్. వెంకట్రావు, వాడె మారగాని నాగేశ్వరరావు, వెలివెల శ్రీను, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం

**తల్లాడ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**



తల్లాడ మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తెలగవరం గ్రామానికి చెందిన తూము నరసింహారావు, కార్యదర్శిగా గొల్లగూడెంకు చెందిన నల్లగట్ల కృష్ణ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా పత్తిపాటి ఏసోబు, ఉపాధ్యక్షుడిగా మేడేపల్లి వెంకటాచారి, కోశాధికారిగా బానోతు బాలకృష్ణ, మహిళా ప్రతినిధిగా రాయల బిందు మాధవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

# అనారోగ్య కార్మికులను ఇబ్బందులకు గురిచేయొద్దు

**- మెడికల్ అటెండెన్స్ నిబంధనలు మార్చాలి**

**- గతంలో మాదిరిగా ఇన్వాలిడేషన్ చేసి కార్మిక కుటుంబాలకు అండగా నిలవాలి: ఏఐటీయూసీ**

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**
సింగరేణిలో మెడికల్ అటెండెన్స్ నిబంధనలను వెంటనే సవరించి, అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను గతంలో మాదిరిగా ఇన్వాలిడేషన్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.అనారోగ్య సమస్యలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న పలువురు కార్మికులు తమ వంతు వచ్చినప్పుడు బోర్డుకు హాజరయ్యేందుకు భయపడుతున్నారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్' అంటూ విధులకు పంపుతున్నారనే ఆందోళన కార్మికుల్లో ఉందన్నారు. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.గతంలో అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించలేని కార్మికుల ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఇన్వాలిడేషన్ చేసి, వారి డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించే విధానం ఉండేదని



గుర్తుచేశారు. అదే విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డుకు 100 మంది హాజరైతే కనీసం 10 శాతం మందిని కూడా ఇన్వాలిడేషన్ చేయని పరిస్థితి కార్మికుల్లో ఆందోళనకు కారణమవుతోందన్నారు.తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కార్మికులను మెడికల్ బోర్డు చుట్టూ తిప్పకుండా, గతంలో ఏరియా ఆసుపత్రుల్లో సీఎంఓ పరిధిలోని వైద్యుల ద్వారా ఇన్వాలిడేషన్ చేసిన విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రధాన ఆసుపత్రి ముఖ్య వైద్య అధికారి పరిధిలో ప్రత్యేక వైద్య కమిటీ ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఇన్వాలిడేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు.
1981 జనవరి 29న స్వర్గీయ మనుబోతుల కొమరయ్య ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలకు వారసత్వ ఉద్యోగాల కల్పనపై కుదిరిన ఒప్పందం స్ఫూర్తిని యాజమాన్యం కొనసాగించాలని మిరియాల రంగయ్య కోరారు. మెడికల్ ఇన్వాలిడేషన్ పేరుతో గతంలో మధ్యవర్తుల ద్వారా కార్మికులను గందరగోళానికి గురిచేసిన పరిస్థితులు పునరావృతం కాకుండా పారదర్శక విధానాన్ని అమలు చేయాలని అన్నారు.సింగరేణిలో మ్యాన్‌పవర్ సర్‌ప్లస్ ఉందని యాజమాన్యం చెబుతున్నప్పటికీ, ఏరియాల్లోనూ వాస్తవంగా సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ లేదని ఆయన పేర్కొన్నారు. అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులను ఇన్వాలిడేషన్ చేసి వారి డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పిస్తే యువతకు ఉపాధి లభించడంతో పాటు కార్మిక కుటుంబాలకు భరోసా కలుగుతుందని తెలిపారు.కార్మికుల ఆరోగ్యం, కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను తక్షణమే సవరించి, గతంలో అమలు చేసిన ఇన్వాలిడేషన్ విధానాన్ని పునరుద్ధరించాలని మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు.

# వేతన చర్చలకు ఐఎన్‌టీయూసీకి దక్కని అవకాశం

**రెండు వర్గాల మధ్య కోర్టు వివాదంతో కొనసాగుతున్న ప్రతిష్టంభన**

**పీఎల్ఆర్ బోనస్ చర్చల్లోనూ దూరంగా ఉన్న ఐఎన్‌టీయూసీ**

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**
దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేతన ఒప్పందాలు, పీఎల్ఆర్ బోనస్ తదితర అంశాలపై జరుగుతున్న చర్చల్లో ఐఎన్‌టీయూసీ ప్రతినిధులకు అవకాశం దక్కకపోవడం కార్మిక వర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఐఎన్‌టీయూసీలోని రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న కోర్టు వివాదమే ఇందుకు కారణమని కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.కోల్ ఇండియా స్థాయిలో కార్మికుల వేతన ఒప్పందాలు, బోనస్ తదితర అంశాలపై యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతుంటాయి. బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ,




హెచ్ఎంఎస్, సీఐటీయూ వంటి జాతీయ కార్మిక సంఘాలకు ఇందులో ప్రాతినిధ్యం ఉంటుంది.అయితే ఐఎన్‌టీయూసీలోని రెండు వర్గాలు తమ వర్గానికే చర్చల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పరిస్థితి సంక్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. ఐఎన్‌టీయూసీ తరఫున కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ దాఖలైనట్లు సమాచారం. పీఎల్ఆర్ బోనస్‌పై చర్చలు జరిగే సమయానికి ఈ పిటిషన్ విచారణకు రాకపోవడంతో ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు చర్చల్లో పాల్గొనలేకపోయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.కోల్ ఇండియాలో భాగమైన సింగరేణిలోనూ ఈ పరిణామాల ప్రభావం కనిపిస్తోందని కార్మిక వర్గాల్లో చర్చ సాగుతోంది. సింగరేణిలో ప్రాంతీయ గుర్తింపు పొందిన ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ నాయకులు సైతం ఈ అంశంపై స్పందించకపోవడం చర్చకు దారితీసింది.వేతనాలు, బోనస్ పెంపుదలలో తమ పాత్ర ఉందని గతంలో ప్రకటించిన యూనియన్ నాయకులు, తాజాగా పీఎల్ఆర్ బోనస్ ప్రకటన సమయంలో చర్చల్లో లేకపోవడం కార్మికుల్లో పలు ప్రశ్నలకు తావిస్తోంది. అయితే ఐఎన్‌టీయూసీ రెండు వర్గాల మధ్య న్యాయపరమైన వివాదం ఎప్పుడు పరిష్కారమవుతుంది? భవిష్యత్ వేతన, బోనస్ చర్చల్లో ఆ సంఘానికి ప్రాతినిధ్యం లభిస్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి వీడాలి




**నిత్యావసర ధరలు తగ్గించాలి**

**రైతులకు 12 గంటల విద్యుత్ ఇవ్వాలి**

**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, రాష్ట్ర కార్యదర్శి ముద్దా బిక్షం మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కనీసం 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, ఆసరా పింఛన్లతో పాటు ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు




నాయిని రాజు అధ్యక్షత వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోకినపల్లి ప్రభాకర్ రావు. అమర్లపూడి రాము. జాటోత్ కృష్ణ. నూప భాస్కర్. ఈసం శంకర్. మాచర్ల సత్యం. జిల్లా కమిటీ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు కల్లూరి కిషోర్. బానోత్ ధర్మ. బుర్ర వెంకన్న. సావిత్రి. పెదబోయిన సతీష్. నూపా సరోజిని. పద్మ. ముత్తమ్మ. గొగ్గల వెంకటేశ్వర్లు. శాంతారావు. నకిరేకంటి నాగేశ్వరరావు. శాస్త్రి వెంకటేశ్వర్లు. రామకృష్ణ. రామారావు. వేల్పుల రమేష్. రాజశేఖర్. తోటకూరి నరేష్. తదితరులు పాల్గొన్నారు

## కిడ్నీ వ్యాధితో మహిళకు ఆర్థిక కష్టాలు.. ఆదుకోవాలని వేడుకోలు



**చర్ల, అక్టోబర్ 06 (తెలంగాణ వాణి):**
మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన మెంతులు దుర్గ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమైన ఆమె కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు వైద్య చికిత్సకు నిరంతరం ఖర్చులు అవుతుండటంతో కుటుంబంపై ఆర్థిక భారం పెరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పరిమిత ఆదాయంతో వైద్య ఖర్చులతో పాటు నిత్యావసరాలను భరించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక సహాయం అవసరమని పేర్కొన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, దయగల వ్యక్తులు స్పందించి ఆమెకు అవసరమైన వైద్య సహాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మినీ క్రీడా మైదానం, సెంట్రల్ లైటింగ్ పనులు వేగవంతం చేయాలి

**- ప్రజా సమస్యలపై తక్షణ స్పందనకు అధికారులకు ఎమ్మెల్యే జారె ఆదేశం**

**- కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేత**

**అశ్వారావుపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం అశ్వారావుపేటలోని మినీ క్రీడా మైదానం, సెంట్రల్ లైటింగ్ పనులను ఆయన పరిశీలించారు.క్రీడా మైదానంలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, మైదానం అందుబాటులోకి వచ్చిన తర్వాత స్థానిక యువత, విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులను కూడా వేగవంతం చేసి, ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మెరుగైన వెలుగులు ఉండేలా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడవద్దని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలపై వినతులు**

అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతిపత్రాలను



స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు నిబంధనల మేరకు న్యాయం చేయాలని సూచించారు.

**మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు**

చంద్రుగొండ మండలానికి చెందిన మహిళలు దిమదర్ ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణను పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సర్టిఫికెట్లను అందజేశారు. మహిళలు శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఇంటి వద్ద నుంచే టైలరింగ్ పనులు చేపట్టి ఆదాయం పొందవచ్చని, ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కోలా లక్ష్మీనారాయణ, సేవాదళ్ మండల అధ్యక్షుడు ఫజిల్ బక్షి, మండల యువ నాయకుడు జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనారాయణ, కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి

**అడిషనల్ డీఎండహెచ్ఓ డాక్టర్ సైదులు**



**చర్ల, అక్టోబర్ 06 (తెలంగాణ వాణి):**
చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎండహెచ్ఓ డాక్టర్ సైదులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో సమావేశమై ప్రజారోగ్యంపై పలు సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ వంటి కీటకజనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు సంస్థాగత ప్రసవాల ప్రాధాన్యతను వివరించాలన్నారు. ప్రతి జ్వరం కేసును తప్పనిసరిగా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. అనుమానిత టీబీ కేసుల్లో కఫ నమూనాలను పరీ క్షలకు పంపించి, నమోదైన కేసులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ తదితర అసంక్రమణ వ్యాధుల (ఎన్‌సీడీ) పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్ధాంతరంగా భగీరథ పైప్‌లైన్ పనులు

## రోడ్లు తవ్వి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

## పనులు పూర్తిచేయాలని కార్పొరేటర్లు, అధికారులకు విజ్ఞప్తి





**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. పైప్‌లైన్ పనుల కోసం జేసీబీలతో సిమెంట్ రోడ్లను తవ్వి, పనులు పూర్తిచేయకుండానే వదిలేస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల ముందు రోడ్లు తవ్వి వదిలేయడంతో ఇంటి వాకిళ్లను శుభ్రం చేసుకోవడం, ముగ్గులు వేసుకోవడం కూడా కష్టంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. తవ్విన ప్రాంతాలను తిరిగి సరిచేసుకునే ఆర్థిక భారం కూడా తమపైనే పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భగీరథ పనులను త్వరగా పూర్తి చేసి, తవ్విన రోడ్లను పునరుద్ధరించాల్సిన బాధ్యత ఎవరిదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాహుల్ గాంధీ నిర్బంధం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

## - బీఎల్‌ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్



**అశ్వారావుపేట/ ములకలపల్లి, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమానికి వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ములకలపల్లి మండల కాంగ్రెస్ బీఎల్‌ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్ ఖండించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలపై ఇండియా బ్లాక్ నేతలు ఢిల్లీలో నిరసన చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకోవడం ఆందోళన కలిగించే పరిణామమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కులని పేర్కొన్నారు. ఓటు హక్కు, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న సందేహాలకు సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తూ శాంతియుత నిరసనలకు అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయకుండా ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, రాహుల్ గాంధీ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సురభి రాజేష్ స్పష్టం చేశారు.

# మానవ సేవే మాధవ సేవగా స్వచ్ఛంద సేవలు

## బాధితులకు అండగా నిలుస్తున్న స్వచ్ఛంద సంరక్షణ సేవా సంస్థ చైర్మన్ కొత్తపల్లి ఎస్తేరు



**తల్లాడ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
మానవ సేవే మాధవ సేవ అనే భావనతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ స్వచ్ఛంద సంరక్షణ సేవా సంస్థ చైర్మన్ కొత్తపల్లి ఎస్తేరు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజయవాడలోని నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద రోగులు, వృద్ధులు, దివ్యాంగులు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు, హెచ్ఐవీ బాధితులకు ఆమె సహాయాన్ని అందిస్తున్నారు. రోగులకు భోజనం, పండ్లు పంపిణీ చేయడంతో పాటు కొత్త దుస్తులు అందిస్తూ మానవతా దృక్పథంతో సేవలు చేస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని ఎస్తేరు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో గొల్లమందల వీరభద్రమ్మ, గొల్లమందల మరియమ్మ సహకరిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

# ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

## - రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య




**అశ్వారావుపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య పిలుపునిచ్చారు. మహాసభల విజయాన్ని కాంక్షిస్తూ తెలంగాణ రైతు సంఘం అశ్వారావుపేట మండల కమిటీ సమావేశం మడకం నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగ సంక్షోభం, పంటలకు గిట్టుబాటు ధర, సాగునీరు, ఎరువులు, విత్తనాల సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి పోరాటాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏఐకేఎస్ మహాసభలు దిశానిర్దేశం చేయనున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు నల్గొండ మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం మండల నాయకులు సీసం రాంబాబు, సంతపురి చెన్నారావు, తుట్టి వీరభద్రం, శాంతి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి

## జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించి నూతన భారతాన్ని నిర్మించుకోవాలి: పిడమర్తి రవి



**తల్లాడ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం తల్లాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం 250 గజాల స్థలం అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అంతకు ముందు తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి పిడమర్తి రవికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి, లక్ష్మారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, అన్నారుగూడెం గ్రామ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, నాయకులు రావుల గోపి గౌడ్, రేగళ్ల శ్రీనివాసరావు, నారపోగు ప్రసాద్ పాల్గొన్నారు.

# 22-ఏ పేరుతో నిషేధిత జాబితాలో ఉన్న భూములను బహిర్గతం చేయాలి

## - సమగ్ర భూ సర్వే నిర్వహించి మిగులు భూములను పేదలకు పంచాలి

## - వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్

**తల్లాడ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉంచిన భూముల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే నిర్వహించి మిగులు భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. సెక్షన్ 22-ఏ భూముల వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తల్లాడలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. బి. ప్రసాద్ మాట్లాడుతూ పేదలు పోరాడి సాధించుకున్న అసైన్డ్, చెరువు శిఖం, అటవీ, బంజరు, ప్రభుత్వ భూముల రక్షణకు విశాల ఐక్య ఉద్యమాన్ని చేపడతామని అన్నారు. ప్రభుత్వ భూములను పెద్దలు, కార్పొరేట్ సంస్థలు ఆక్రమించుకున్న ప్రాంతాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.
జిల్లా కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పేదలు ఏళ్లుగా నివసిస్తున్న ప్రాంతాల్లో ఇళ్ల తొలగింపునకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. 22-ఏ కింద బ్లాక్‌లిస్టులో ఉన్న భూముల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని, సమగ్ర భూ సర్వే చేపట్టి మిగులు భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 10న ఖమ్మం కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 10 నుంచి 25 వరకు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు, అక్టోబర్ 25 నుంచి నవంబర్ 10 వరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం పేదల భూముల రక్షణ కోసం ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల పూర్తి వివరాలను గ్రామపంచాయతీల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచాలని కోరారు. ధరణి, భూ భారతి రికార్డుల్లోని తప్పులను సరిచేసి పేదల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల పరిస్థితిపై ప్రభుత్వం పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు.




కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జాజిరి శ్రీనివాసరావు, తన్నీరు కృష్ణ, అర్జున్‌రావు, తాళ్లపల్లి కృష్ణ, రైతు సంఘం నాయకులు శీలం సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, నాగేశ్వరరావు, కొండెబోయిన నాగేశ్వరరావు, పాపినేని రామనరసయ్య, బంధం రాజ్యం, గద్దల రత్తమ్మ, నంద్ర ప్రసాద్, కేవీ రెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, బంధం శ్రీను, లెనిన్, తూము సుధాకర్, గుమ్మ నరసరావు, వేల్పుల భద్రయ్య, కారుమంచి గురవయ్య, మల్లేశ్వరరావు, గామాసు జోగయ్య, మొర్రి మేకల వెంకన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్ స్థలాన్ని పరిశీలించిన నాయకులు



**తల్లాడ, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
తల్లాడ పట్టణంలోని అంబేద్కర్ భవన్ పక్కన నిర్మాణ పనులకు సంబంధించిన స్థలాన్ని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, అంబేద్కర్ భవన్ కమిటీ గౌరవ సలహాదారు రావుల గోపి గౌడ్ మంగళవారం పరిశీలించారు. అంబేద్కర్ భవన్‌కు వచ్చే వారు సమావేశాల సమయంలో ఇబ్బందులు పడకుండా స్థలాన్ని వినియోగించాలని వారు సూచించారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాల్లో భవన నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐకేపీ భవన్ కోసం వైరా రోడ్డులో శంకుస్థాపన చేసిన ప్రదేశంలోనే నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఐకేపీ భవన్ కోసం తీసిన గుంతలను వెంటనే పూడ్చాలని, లేనిపక్షంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు నారపోగు ప్రసాద్, కాంపాటి రవి, జీ. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## - ఖాళీ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలి

## -భద్రాచలం మండల పరిషత్‌కు మినిస్టీరియల్ సిబ్బందిని కేటాయించాలని వినతి





**భద్రాచలం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి)**
పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, ఐఏఎస్‌ను భద్రాచలంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు కార్యాలయాల పనితీరు మరింత మెరుగుపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 32 మండలాల్లో భద్రాచలం మండలం కూడా ఉన్నందున, భద్రాచలం మండల పరిషత్ కార్యాలయానికి అవసరమైన మినిస్టీరియల్ సిబ్బందిని వెంటనే కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దివ్య హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మల్లవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ వెల్డి ప్రసాద్, జిల్లా బాధ్యులు శ్రావణి కృష్ణ, అంబిక తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంగాన్ మిలాన్ కార్యక్రమం



**హుస్నాబాద్ అక్టోబర్ 6 (తెలంగాణ వాణి ఆర్ సి)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సేవలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పీఎం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా హుస్నాబాద్ మండలం లోని పందిళ్ల, దేవేందర్‌నగర్, పోట్లపల్లి, మడద అంగన్వాడీ క్లస్టర్ సెంటర్లలో అంగాన్ మిలాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షుడు బుక్యా సంపత్ నాయక్ అధ్యక్షతన బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యురాలు లకావత్ శారదా నేతృత్వంలో చిన్నారులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మహిళా గ్రూప్ సీఏలను బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి లకావత్ శారద చీరలు అందజేసి, శాలువాలతోసత్కరించారు. కార్యక్రమానికి ఆతిధులు గా బిజెపి రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల రెడ్డి, తోట స్వరూప, మాజీ ఎంపిటిసి బానాల జయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెల్దండి రాజేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి బైరి అరుణ్, ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు పుదారి కిష్టయ్య, నాయకులు నెల్లి శ్రీనివాస్, బొల్లి సుధాకర్, పెనాల శ్రీనివాస్, వెల్దండి సత్యనారాయణ, బొమ్మగాని జగ న్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజంలోని వివిధ వర్గాలకు సేవాకార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యంతో పీఎం సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, మహిళల సంక్షేమం కోసం అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని అందుకే వారిని సన్మానిస్తున్నామని పేర్కొన్నారు.

# గ్రామాల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

## ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**




ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజక వర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద అవసరమైన పనులను ముందుగానే గుర్తించి, ఎక్కువ మందికి ఉపాధి లభించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచే విధంగా పనుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు.

# బర్రెల దొంగల ముఠా అరెస్ట్

## - పోలీసుల అదుపులో నలుగురు నిందితులు .. ఆటో, రూ.80 వేల నగదు స్వాధీనం

**చౌటుప్పల్, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల బర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం రెడ్డిబావి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ ఆటోను ఆపి తనిఖీ చేశారు. పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, చౌటుప్పల్‌తో పాటు పలు ప్రాంతాల్లో బర్రెల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితులను అడ్డాడి రాఘవేంద్రరావు, దాసరి యాదయ్య, అడ్డాడ శ్రీనివాసరావు, చాపల సైదులుగా గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. వారి నుంచి ఒక ఆటో, రూ.80 వేల నగదు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
బుధవారం , అక్టోబర్ 7 , 2026

# పట్టభద్రుల ఓటు.. రాజకీయ పార్టీలకు మరో పరీక్ష

**ఓటరు నమోదుపై బీఆర్ఎస్ దృష్టి**

**ప్రజల్లోనే ఉంటున్నామంటున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి**

**ఎమ్మెల్సీ ఎన్నికలపై పెరుగుతున్న రాజకీయ కదలికలు**







**కొత్తగూడెం, అక్టోబర్ 6 (తెలంగాణ వాణి):**
సాధారణ ఎన్నికలకు భిన్నంగా జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రత్యేక సవాలుగా మారుతున్నాయి. విద్యావంతులు, పట్టభద్రులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత పరిచయం, గతంలో ప్రజా సమస్యలపై చేసిన పోరాటాలు, పట్టభద్రుల సమస్యలపై వారి వైఖరి కీలక అంశాలుగా మారే అవకాశం ఉంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే పట్టభద్రుల ఓటరు నమోదుపై దృష్టి సారిస్తున్నాయి.ఈ నేపథ్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండే నాయకత్వం అవసరమని ఆయన పేర్కొన్నారు.

గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ ప్రజలకు దూరం కాలేదని రాకేష్‌రెడ్డి అన్నారు. పట్టభద్రుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతోందని పేర్కొన్నారు. ప్రజలు, పట్టభద్రుల సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తున్నామని తెలిపారు. అమలు కానీ హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలను అరిగోస పెడుతుందన్న రాకేష్‌రెడ్డి ప్రభుత్వంపై తమ అసంతృప్తిని ఓటర్లు ఓటు రూపంలోవ్యక్తంచేయాలని పిలుపుని చ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఆలోచించాలని, బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ చైర్మన్ సీతా మహాలక్ష్మి, యువనేత అనుదీప్, జైరాం, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.